క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



తెనాలి: పట్టణంలోని 6వ వార్డులో రూ.21 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు గురువారం కౌన్సిలర్లు శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం వార్డు సచివాలయానికి కేటాయించి రూ.20లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. స్థానిక వార్డు కౌన్సిలరు కొర్రపాటి లక్ష్మి, 34వ వార్డు కౌన్సిలరు పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మాదల కోటేశ్వరరావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎల్బీ చిన్నా, పవన్‌సాయి, శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

నోటు పుస్తకాల పంపిణీ



తెనాలిటౌన్: పట్టణంలోని గాంధీనగర్ నరేంద్ర కాలనీలోని ఉర్దూ మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర యోగ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నోటు పుస్తకాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య విద్యార్థులతో ఆసనాలు వేయించి, ధ్యానం చేయించారు. వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు ఈఎల్‌వీ అప్పారావు, యోగాసభ్యులు ఎం.సాంబ్రాజ్యం, స్కూల్ హెచ్ఎం జరీనా బేగం, మాధవి, అనూష, పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.


ఐటీఐలో రెండో విడత ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి: ఐటీఐలో ప్రవేశానికి ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గూడవల్లి టీఆర్‌సీ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ జి.హుల్దాలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, మెకానిక్ డీజిల్ కోర్సులకు ఈ నెల 12 నుంచి 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు iti.a p.go-v.i n లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆగష్టు 1న ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 93986 50408, 86482 58622 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఐలవరం ఉప సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా కర్రా జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం గురువారం స్థానిక సచివాలయంలో ఉప సర్పంచ్ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా ఈవోపీఆర్డీ టి.ఉషారాణి వ్యవహరించారు. ఉప సర్పంచ్ పదవికి 11వ వార్డు సభ్యురాలు కర్రా జయశ్రీ పేరును 6వ వార్డు సభ్యుడు సంగా బత్తుని వెంకటేశ్వర్లు ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ ఎన్నికలో 13 మంది వార్డు సభ్యులు పాల్గొన్నారు. 14వ వార్డు సభ్యుడు, ఉప సర్పంచ్‌గా పని చేసిన పప్పుల వెంకటేశ్వరరావు ఇటీవల పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప సర్పంచ్‌గా ఎన్నికైన జయశ్రీతో ఈవోపీఆర్డీ ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ సెక్రటరీ ఎండీ జిక్రియ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాకంబరి ఉత్సవాలు



రేపల్లె రూరల్: ఆషాఢ మాసం ఏకాదశి సందర్భంగా గ్రామ దేవత శ్రీ బూరుగల్మ దేవాలయంలో గురువారం శాకంబరిదేవి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవతో అర్చకుడు నందివెలుగు భాను సుధాకర్ పసుపు, కుంకుమలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు, కూరగాయలతో శాకంబరి అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని, సద్దినైవేద్యాలు, కూర గాయలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వారధులు..సంక్షేమ సారథులు

- నిస్వార్థ సేవకు నిదర్శనం గ్రామ, వార్డు వలంటీర్లు
- రాజకీయ కోణంలో జనసేన అధినేత అనుచిత వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన సామాన్యులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు

తెనాలిటౌన్: ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు పనిచేస్తున్నారని పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు చెప్పారు. పథకాలు, ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాల్సి వచ్చేదని, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ బాధలు తొలగిపోయాయని వెల్లడించారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వం సంక్షేమ పథకాలను తెలియజేసి, అందిస్తున్నారని చెబుతున్నారు. నిస్వార్థంగా, ప్రభుత్వానికి, తమకు వారధులుగా సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు, జనసేన అధినేత పవన్ కల్యాణ అనుచిత వ్యాఖ్యలను వారు తప్పుబట్టారు.

పార్టీలపరంగా విమర్శలు చేసుకోవాలి



పార్టీల పరంగా రాజకీయ నాయకులు విమర్శలు చేసుకోవాలి. ప్రజలకు సేవలు అందించే వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేయడం మంచిదికాదు. వలంటీర్ వ్యవస్థ చాలా మంచిది. ఇంటికి వచ్చి సేవలు అందిస్తున్నారు. వలంటీర్ల వల్ల నష్టం లేదు.

– బీచిపోగు రవి, డప్పు కళాకారుడు, కొలకలూరు.

నిస్వార్థంగా శ్రమిస్తున్నారు



వలంటీర్లు ఇంటింటికి తిరిగి ఎంతో శ్రమిస్తున్నారు. పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. అలాంటి వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదు. పవన్ కల్యాణ్ వాళ్లకు క్షమాపణ చెప్పాలి. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వారి పాత్ర కీలకం.

–సయ్యద్ ఖైరూన్, చేయూత లబ్ధిదారు, కొలకలూరు.

1వ తారీఖునే పింఛను ఇస్తున్నారు



మా వార్డులో ఒకటో తారీఖున పింఛను తప్పనిసరిగా ఇస్తారు. ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డులో వారి సమస్యలను తెలుసుకుంటారు. సేవలు అందిస్తున్న వలంటీర్లను అందరూ అభినందించాలి.

– భూసాని కుమారి,చేయూత లబ్ధిదారు, కొలకలూరు

బాధ్యతతో పనిచేస్తున్నారు



వలంటీర్లు బాధ్యతతో పనిచేస్తున్నారు. కాపు నేస్తం పథకం గురించి మాకు తెలియజేశారు.అర్జీ పెట్టించి కాపునేస్తం నగదు వచ్చే విధంగా చూశారు.మాకు వలంటీరు ద్వారా లబ్ధి చేకూరింది.వారు చేస్తున్న సేవలు మరువలేనివి.పవన్ వారిపై చేసిన వ్యాఖ్యలను విరమించుకోవాలి,వారికి క్షమాపణ చెప్పాలి.

– శిఖినం నాగేశ్వరమ్మ, కాపునేస్తం లబ్ధిదారు, కొలకలూరు.

వలంటీర్లు సేవలు చేస్తున్నారు



వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులకు వలంటీర్లు సకాలంలో పింఛను అందిస్తున్నారు. నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను విమర్శించడం మంచిది కాదు. పవన్ కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలి.

ఉన్నం బుజ్జమ్మ, వితంతు పింఛనుదారు, కొలకలూరు.

ఆడీ కృత్తిక మహోత్సవాలు ప్రారంభం



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



రామేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు

తెనాలిటౌన్: రూరల్ మండలం పెదరావూరులోని శ్రీ అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రం మహా విద్యాపీఠంలో ఆడీ కృత్తిక మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సుబ్రహ్మణ్యం స్వామికి ప్రత్యేక అభిషేకం, పుష్పార్చన, నీరాజ మంత్రపుష్పం జరిపారు. భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీ పర్వతవర్ధని సమేత రామేశ్వరస్వామి ఆలయంలో ఆడీ కృత్తిక మహోత్సవం సందర్భంగా బాలకుమారస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అభిషేకాలు జరిపారు. స్వామివారికి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అర్చకులు పెనుమూడి వెంకట సుబ్బారావు, పవన్‌కుమార్ కల్యాణం జరిపించారు. ఆలయ ఈఓ వీవీ రమణకుమారి, ఉమామహేశ్వరరావు, లక్ష్మీ, నీలా వెంకట కుమార్, నాగమణి, లేఖన, తేజ పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్‌కు రూ.25 వేలు విరాళం



నగదు అందజేస్తున్న మోహన్

తెనాలి: తెనాలి బ్రాహ్మణ పరిషత్‌కు హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు చెరువు మోహన్ గురువారం బ్రాహ్మణ పరిషత్‌కు రూ.25,116 విరాళం అందజేశారు. సంస్థ కార్యాలయంలో అధ్యక్షుడు పరాశరం వెంకట రామగోపాల్‌కు ఆ మొత్తాన్ని అందించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతావఝుల పురుషోత్తమశర్మ మాట్లాడారు. అర్చకులకు వంశ పారంపర్య హక్కులు, జీతాల పెంపు, వయోపరిమితి పెంపుపై రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీర్మానం చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనువంశిక అర్చక సంఘ అధ్యక్షుడు ఆర్ఎన్ గోపాలకృష్ణను సత్కరించారు. పరిషత్ కోశాధికారి వడ్లమాని ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చెన్నాప్రగడ శ్రీనివాస్, వైకుంఠపురం ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు వంగల మాధవరావు, త్రిపురారిభట్ల దత్తాత్రేయశాస్త్రి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ త్రిపురారిభట్ల సత్యజ్ఞానప్రసూనాంబ, బ్రాహ్మణ క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ, గుంటూరు జిల్లా డైరెక్టర్ నందివెలుగు రామకృష్ణశర్మ, గొర్తి అన్నపూర్ణయ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు: మేయర్




పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్ పార్వతీపురంలో రూ. 45 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికే రామనామక్షేత్రం ప్రధాన రహదారి విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రహదారుల విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. తమ పాలకవర్గం ఏర్పడ్డాక నగరపాలక సంస్థ పరిధిలో రూ. 200 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని, అంతేకాకుండా నగరాభివృద్ధికి కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని మేయర్ వివరించారు. నగరాభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధుల్ని కలుపుకొని వెళ్తామని, వారి అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు కూడా పనుల్ని నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆయన చెప్పారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని మేయర్ సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ 20వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కంతేటి శ్యాంశేఖర్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపేట శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

నగరంలోని శ్రీనివాసరావుపేట హిందూ శ్మశానవాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 6 కోట్లతో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని శ్మశానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. శ్రీనివాసరావుతోటలోని వాటికను నగరంలోని ఎనిమిది డివిజన్లకు చెందిన సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. వారి ఆకాంక్ష మేరకు శ్మశానవాటికలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కర్మకాండలు నిర్వహించడానికి బస్టాండ్ వద్ద గల సత్రాన్ని వినియోగిస్తున్నారన్నారు. ఇకనుంచి శ్మశానవాటికలోనే చేసుకోవడానికి వీలుగా సత్రాన్ని నిర్మిస్తున్నామని మేయర్ వెల్లడించారు. నగరంలో శ్మశానాల అభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ, సహకారాలు కూడా తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనాల కోసం పోస్టుకార్డు ఉద్యమం



గుంటూరు ఎడ్యుకేషన్: అసంఘటిత రంగంలో గృహ కార్మికులుగా మగ్గుతున్న మహిళలకు పీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనాల్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రికి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ఏపీ గృహ కార్మిక సమాఖ్య కార్యదర్శి సిస్టర్ వ్యాకుల మేరి ఆధ్వర్యంలో మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో సమావేశమైన గృహ కార్మిక మహిళలు అక్కడి నుంచి బ్రాడీపేటలోని హెడ్ పోస్టాఫీసు వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాకుల మేరి మాట్లాడుతూ గృహ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా గృహ కార్మికులుగా మగ్గుతున్న మహిళలకు సామాజిక భద్రత లభిస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని అందజేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 100 మందికి పైగా మహిళలు పోస్టుకార్డులు రాసి ప్రధానమంత్రికి పంపారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఆర్. దుర్గ, కార్యదర్శి బి. లావణ్య, గృహ కార్మికులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి



గరికపాడు(కాకుమాను): నాడు–నేడు పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈవో కెఎఫ్. కెనడీ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గరికపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనుల్ని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు–నేడు ద్వారా విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శాకంబరీ దేవిగా అమ్మవారు



పెదకాకాని: శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏసీ ఎస్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకర రావు తెలిపారు. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారితో పాటు ఆలయాన్ని నయనానందకరంగా అలంకరించినట్లు చెప్పారు. శాకాంబరీదేవి అలంకరణలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు శుక్రవారం నుంచి ఆదివారం వరకూ దర్శనమిస్తారని వారు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

ట్రిపుల్ ఐటీకి ఐదుగురు ఎంపిక

కొల్లిపర: మండలంలోని ఐదుగురు విద్యార్థులు రాష్ట్రంలోని ట్రిపుల్‌ఐటీల్లో సీటు సాధించినట్లు ఎంఈవో సాల్మన్ రాజు తెలిపారు. గురువారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కొల్లిపర హైస్కూల్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని చెందిన నీలా రజిత నూజివీడు క్యాంపస్, ఏవీ బ్లెస్సీ ఒంగోలు క్యాంపస్ , మున్నంగి హైస్కూల్‌కు చెందిన ఎస్.శైలజ నూజివీడు క్యాంపస్, పి.షాహిన ఒంగోలు క్యాంపస్ , అత్తోట హైస్కూల్‌కు చెందిన ఎ.గోవర్ధననాయుడు నూజివీడు క్యాంపస్ కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో2 ఝాన్సీలత, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ ఎం.రమేష్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయలు విద్యార్థులను అభినందించారు.

నేడు ఐపీఏ అమరావతి శాఖ ప్రారంభోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసిసోయేషన్ (ఐపీఏ) అమరావతి శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముంబై ఐపీఏ అధ్యక్షుడు డాక్టర్ టి.వి.నారాయణ, ఐపీఏ ఎడ్యుకేషన్ డివిజన్ చైర్మన్ డాక్టర్ ఎస్. విద్యాధర ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రేపు లివర్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: లివర్ పనితీరును తెలుసుకునేందుకు అవసరమైన స్కాన్ పరీక్షను ఉచితంగా చేస్తున్నామని కేర్ వెల్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని ఆస్పత్రిలో ఈనెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే వైద్య శిబిరాన్ని లివర్ సంబంధిత సమస్యలతో బాధపడేవారు వినియోగించుకోవాలని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా కోరారు. 8341713713, 9884757999 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలనిని ఆయన సూచించారు.

బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: కొరిటెపాడులోని ఎస్ఆర్ఎంవో హైస్కూల్లో గురువారం 8,9,10 తరగతుల విద్యార్థినులకు బాల్య వివాహ నిషేధ చట్టం –2006తో పాటు ఏపీ బాల్య వివాహ నిషేధ నియమాలు–2023పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగ న్యాయ, పర్యవేక్షణాధికారి బి. వాసంతి బాలల హక్కులకు సంబంధించిన చట్టాలు, ప్రాథమిక హక్కులపై మాట్లాడారు. సామాజికవేత్త రషీద్ 1098 చైల్డ్‌లైన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లలిత పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందించేందుకు 'జగనన్న సురక్ష'



మూడో వార్డులో సర్టిఫికెట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీం

తెనాలి: విద్యార్థుల నుంచి వివిధ వర్గాల ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను కాలయాపన లేకుండా ఉచితంగా సత్వరం అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం అన్నారు. పట్టణంలోని ఎన్వీఆర్ కాలనీ సచివాలయం, చినరావూరు–3, చినరావూరుతోట–1, మాదలవారి వీధి, చెంచుపేట–1 సచివాలయాల పరిధిలో గురువారం జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహించారు. మొత్తం 1,132 మంది అర్జీదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. మూడో వార్డులో జరిగిన శిబిరంలో చైర్‌పర్సన్ ఖలేదా నసీం, కౌన్సిలరు ఆవుల కోటయ్యతో కలసి సర్టిఫికెట్లను అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని 90 శాతం మంది పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధిని కలిగిస్తోందని గుర్తుచేశారు. చిన్న సాంకేతిక కారణాలతో పథకాలను దూరమవుతున్న అర్హులకు సంక్షేమాన్ని అందించాలనే భావనతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడుతూ, సర్టిఫికెట్లకు సంబంధించి దరఖాస్తులను కూడా మున్సిపాలిటీనే ముద్రించి ఉచితంగా అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆరోగ్యకర వాతావరణం ఇవ్వాలి



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మ

తెనాలిరూరల్: భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. పట్టణంలోని మోరిస్‌పేట ఆర్ఆర్ నగర్‌లోని గిరిజన గురుకుల పాఠశాలను గురువారం ఆయన పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ, దోమల నివారణపై పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమ లార్వాను తినే గాంబూసియా చేపలను పెంచాలని సూచించారు. తడి, పొడి చెత్తగా వేరు చేయడం ద్వారా వాటిని రీసైకిల్ చేసే వీలు కలుగుతుందన్నారు. తాగి పడేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్, కాగితపు గ్లాసులు దోమల పెరుగుదలకు కేంద్రాలవుతాయని చెప్పారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల హెలన్ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందన్నారు. నీటి నిల్వలు లేకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కాచి చల్లార్చిన నీటిని తగాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ బండి విజయ్‌కుమార్, హెల్త్ సెక్రటరీలు రజిని, సునీత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వై.లక్ష్మీనారాయణ, శానిటరీ సెక్రటరీ లక్ష్మీప్రసన్న, విజయరాణి, చింపిరయ్య, వెంకటేశ్వర్లు ఫైలేరియా సీనియర్ ఇన్‌స్పెక్టర్ రవి, మలేరియా సిబ్బంది బండారు మల్లేశ్వరరావు, షేక్ రషీద్, నవీన్, రత్నాకర్, బాషిత్ పాల్గొన్నారు. బీసీ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో గాంబూషియా చేపలను వదిలారు.

అర్హులందరికీ సర్టిఫికెట్లు



మున్నంగిలో ధ్రువపత్రం అందజేస్తున్న తహసీల్దారు నాంచారయ్య

మున్నంగి(కొల్లిపర): అర్హులందరికి అవసరమైన ధ్రువపత్రాలను సత్వరం అందించడమే జగనన్న సురక్ష శిబిరం ఉద్దేశమని తహసీల్దారు జి.నాంచారయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రమోహన్ అన్నారు. మండలంలోని మున్నంగి గ్రామ సచివాలయం 1, 2లో అధికారులు గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. అధికారులు 250 మంది అర్జీదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడారు. సంక్షేమ పథకాల విషయంలో ఎటువంటి సమస్యలున్నా, సర్టిఫికెట్లు కావాలన్నా గ్రామ సచివాలయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఆరిగ చంద్రారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి, సర్పంచ్ వేమూరి దీనమ్మ, దంతలూరు సర్పంచ్ జ్యోతుల బాగ్యమ్మ, ఉప సర్పంచ్ ఎ.నాగిరెడ్డి, ఈఓపీఆర్డీ పూర్ణశంకరరావు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, తెనాలి ఏడీఏ కె.వెంకటరావు, ఏపీఎం సుజాత పాల్గొన్నారు.

సమన్వయంతో ఓటర్ల జాబితా తయారీ



మాట్లాడుతున్న ఆర్డీవో జగన్నాథం పార్థసారథి

రేపల్లె: ఎన్నికల నేపథ్యంలో ఖచ్చితమైన ఓటర్ల జాబితాను ప్రకటించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి అన్నారు. పట్టణంలోని సీతారామయోగిని కల్యాణ మండపంలో గురువారం రేపల్లె నియోజకవర్గంలోని నాలుగు మండలాల బీఎల్వోలతో సమావేశంలో నిర్వహించారు. ఓటర్ల జాబితాను ఎలాంటి తప్పులకు తావివ్వకుండా మార్పులు, చేర్పులు చేయాల్సిన బాధ్యత బీఎల్వోలపై ఉందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జులై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటి సర్వే నిర్వహించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించి ఖచ్చితమైన సమాచారంను సేకరించాలన్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చైతన్య పరిచాలన్నారు. ఇంటింటి సర్వేలో ఒకే డోరు నంబరులో అధికంగా ఉన్న ఓట్లను గుర్తించి, మండలస్థాయి అధికారులకు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.